www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 21 | మార్చి | 2026 పేజీలు : 8

## నేడు ఈద్..ఉల్...ఫితర్ రంజాన్





7 లో

# పొరబడ్డారా.. అలవాటుగా చేశారా..!?



ఫైల్

- వెలుగుమట్ల ఘటనలో అధికారుల తీరుపై విమర్శలు
- అర్హులను కాదని అనర్హులకు పట్టాలు
- భూదాన్ భూమి ముఖం చూడని వారికి మంజూరి పత్రాలు



ఫైల్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వెలుగుమట్లపై విమర్శలు ఆగడం లేదు. కూల్చివేతలతో జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం బదనాం అయిన తర్వాత కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందింది. ముగ్గురు మంత్రులు భూదాన్ బాధితుల్లో అర్హులను గుర్తించి 311 మందికి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆగమేఘాల మీద మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. విమర్శలను తిప్పికొట్టి బాధితుల పక్షాన ప్రభుత్వం నిలబడిందని చెప్పాలనుకున్న అమాత్యులకు అధికారులు ఝలక్ ఇచ్చారు. ఏమి జరిగిందో కానీ పట్టాలు అందుకున్న వారిలో చాలా మంది అనర్హులు ఉన్నారని అందులో మిగతా 2లో..

# ఓడినా.. కౌన్సిలరేనా..!



### -కలెక్టర్ గారు జర దేఖో



//RTRPAD//
GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE: KHAMMAM
IDOC Khammam - 507318

RC.No/DCO/A4/443/Minister/2026 Dated 13.03.2026

From
Sri Anudeep Durishetty, I.A.S.,
Collector & District Magistrate,
Khammam

To
The Municipal Commissioner,
Wyra Municipality

Sub:- Special Grievance – Khammam District – Wyra Municipality – Application filed by Sri Kanneganti Nagesh, Councillor, 8th ward, Wyra Municipality – Requested for sanction and Construction of SC Kalyana Mandapam in their ward – Forwarded to take necessary action – Reg.

Ref:- A/o Sri Kanneganti Nagesh, Councillor, 8th ward, Wyra Municipality before the Hon'ble Deputy Chief Minister, Minister for Finance, Palnning & Energy, Government of Telangana Dt: 08.02.2026.

I invite your attention to the reference cited. Wherein Sri Kanneganti Nagesh, Councillor, 8th ward, Wyra Municipality has filed a representation before the Hon'ble Deputy Chief Minister, Minister for Finance, Planning & Energy, Government of Telangana requesting for sanction and Construction of SC Kalyana Mandapam in their ward.

In view of the above, it is instructed to examine the grievance petition in detail, and take necessary action as per rules, at the earliest, under intimation to this office.

Encl: Original Copy

Yours faithfully
Sd/- A Padma Sree
For Collector,
Khammam

//Attested//
Superintendent

Copy to Sri Kanneganti Nagesh, Councillor, 8th ward, Wyra Municipality for information.

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్నికల్లో ఓడిపోయిన వారిని కౌన్సిలర్‌గా గుర్తించడం విచిత్రం. ఇది ఎవరో సామాన్యులు చేశారనుకుంటే పొరపాటే. జిల్లాకే తలమానికమైన కలెక్టర్ కార్యాలయం నుంచి లిఖిత పూర్వకంగా పరిశీలన నిమిత్తం ఒక ఆదేశం వెలువడటం మరి విచిత్రం. ఓడిపోయిన వారిని కౌన్సిలర్‌గా ఎలా గుర్తిస్తారంటూ ప్రజలు అవాక్కు అవుతున్నారు. వివరాల్లోకి వెళితే... ఫిబ్రవరి 11న జరిగిన వైరా మున్సిపల్ ఎన్నికల్లో ఎనిమిదవ వార్డు నుంచి చిలకా చిన్నకోటయ్య గెలుపొందారు. ఆయనపై పోటీ చేసిన కన్నెగంటి నగేష్ ఓటమి పాలయ్యారు. ఇంత వరకు సజావుగానే జరిగింది. కౌన్సిలర్‌గా చిలకా చిన్నకోటయ్య బాధ్యతలు స్వీకరించారు. కానీ ఓటమి చెందిన కన్నెగంటి నగేష్ తమ వార్డులో ఎస్సి కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కోరారని విక్రమార్క తమకు సిఫారసు చేసినందున కళ్యాణ మండప నిర్మాణ విషయం పరిశీలించాలని కలెక్టరేట్ నుంచి వైరా మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ పేరున ఒక ఆదేశాన్ని జారీ చేశారు. అందులో కన్నెగంటి నగేష్ కౌన్సిలర్ ఎనిమిదవ వార్డు అని స్పష్టంగా పేర్కొనడం విశేషం. ఓడిపోయిన వ్యక్తిని కౌన్సిలర్‌గా ఎలా గుర్తిస్తారని వైరా మున్సిపల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ పక్షాన ఎ. పద్మశ్రీ పేరుతో ఈ లేఖ విడుదల కాగా దీని కాపీని కన్నెగంటి నగేష్‌కు సైతం ఇవ్వడం విశేషం. అధికార యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఈ లేఖ ద్వారా అవగతమవుతుంది. కలెక్టర్ పేరున ఇచ్చిన ఈ లేఖకు సంబంధించి సూపరింటెండెంట్ ఇతర అధికారులు కన్నెగంటి నగేష్ కౌన్సిలర్‌గా గెలిచారా లేదా అన్న విషయం తెలుసుకోకపోవడం శోచనీయం. ఇటీవల బోనకల్ మండల తహసీల్దార్ ఈ ఏడాది మార్చి 26 తేదీతో ఒక ధృవపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. ప్రస్తుతానికి అవి చిన్న చిన్న తప్పులే కావచ్చు కానీ వీటి వల్ల ఇప్పటికీ ఇప్పుడు జరిగే ప్రమాదం ఏమి లేకపోవచ్చు కానీ ముఖ్యమైన విషయాలలో ఇదే నిర్లక్ష్యం చోటు చేసుకుంటే ఉన్నతాధికారులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# కడుపుకోత మిగిల్చిన గోదారమ్మ

- ఐదుగురు విద్యార్థులు దుర్మరణం
- శోక సంద్రంలో కుటుంబాలు
- దైవదర్శనానికి వచ్చి అనంతలోకాలకు..
- ముగ్గురి మృతదేహాలు లభ్యం
- కొనసాగుతున్న గాలింపు చర్యలు







గోదారమ్మ కడుపుకోతను మిగిల్చింది. ఐదు కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. స్నానాల కోసం వెళ్లిన ఐదుగురు విద్యార్థులు అనంత లోకాలకు చేరుకోవడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు. తల్లీ గోదారమ్మా అంటూ ఎన్నో మొక్కులు మొక్కుకుంటుంటే ఆఖరికి కన్నబిడ్డలనే మింగేసిందంటూ బోరున విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. -ప్రజాపక్షం/భద్రాచలం

2 లో

# పొరబడ్డారా.. అలవాటుగా చేశారా..!?

(మొదటిపేజీ తరువాయి)

కొంత మంది కనీసం భూదాన్ భూముల వైపు చూడనివారు ఉన్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కేటాయించిన నెంబర్ల ప్రకారం అనర్హుల ఫ్లాట్ నెంబర్లను సైతం ఉదాహరిస్తున్నారు. అధికారులు పొరబడ్డారో లేక అలవాటు ప్రకారం అనర్హులకు అవకాశం కల్పించారో కానీ వెలుగుమట్ల మంటలు చల్లారడం లేదు. ఎక్కడ ఇంటి జాగా లేని వారికి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కూడా మంజూరు చేస్తున్నట్లు మంత్రులు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు , పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు ప్రకటించారు. మరీ ఖమ్మంలో రెండు, మూడు చోట్ల ఇండ్ల స్థలాలు ఉండి ఆర్థికంగా బలమైన వ్యక్తులకు సైతం ఇంటి స్థలం, ఇండ్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల సమక్షంలో భూదాన్ భూముల్లోని వినోబానగర్‌లో నివసించే వారి వివరాలు సేకరించగా భూదాన్ భూముల్లో నివసించని వారి పేర్లు అర్హుల జాబితాలో ఎలా చోటు చేసుకున్నాయన్న ప్రశ్నకు అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు తమ అనుయాయులను అర్హుల జాబితాలో చేర్చేందుకు రాజకీయ పైరవీలు జరుగుతాయి. అటువంటి పైరవీలకు తలొగ్గి రాజకీయ పార్టీ నేతలు చెప్పిన వారికి జాబితాలో అవకాశం కల్పించారా అన్నది తేలాల్సి ఉంది. మొత్తంగా వెలుగుమట్ల ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం విమర్శల నుంచి బయట పడటం లేదు. ఇదిలా ఉండగా అధికారుల తాము కూల్చింది 721 ఇండ్లు మాత్రమే అని చెబుతుండగా బాధితుల పక్షాన 1,100 దరఖాస్తులు రావడం కొసమెరుపు.



**కలెక్టరేట్ వద్ద ఆందోళన...**
భూదాన్ భూముల కూల్చివేత బాధితులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం అర్హులైన తమను కాదని అనర్హులకు అవకాశం కల్పించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు ఆందోళనకారులను వినతి పత్రం ఇచ్చేందుకు సైతం అనుమతించకపోవడంతో గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

# ప్రతీ ఇంటా రంజాన్ సంతోషాలు వెల్లి విరియాలి

**- జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు**
**- కూనంనేని, సాబీర్ పాషా**



ప్రజాపక్షం/ కొత్తగూడెం : రంజాన్ పండుగ సామానత్వానికి మానవత్వాన్ని నిలుపుటద్దం మని కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని వారు ముస్లీం కుటుంబాలకు, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా ముస్లీం సోదరులందరూ ఎంతో సంతోషంగా ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు చేపట్టి, క్రమశిక్షణతో కూడిన జీవనాన్నిగడపడం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తి దాయకమన్నారు. ముఖ్యంగా జకాత్ వంటి దానధర్మాల ద్వారా పేదవారి ఆకలి తీర్చడం రంజాన్ చాటుతుందన్నారు. భద్రాద్రి జిల్లా మత సామరస్యానికి పెట్టింది పేరని, అల్లాహ్ ఆశీస్సులతో ప్రతీ ఇంటా సుఖ సంతోషాలు వెల్లి విరియాలని వారు ఆకాంక్షించారు. మనిషిలోని స్వార్థాన్ని వీడి తోటికి వారికి సహాయం పడే గుణాన్ని ఈ పండుగ పొంపెందిస్తుందని తెలిపారు. పవిత్రప్రార్థనలు సమాజంలో శాంతిని, ఐఖ్యతను నెలకొల్పుతాయని, వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా పండుగను జరుపుకోవాలని వారుకోరారు.

# భూదాన్ ముఠా సభ్యుడు అరెస్ట్..
## రిమాండ్‌కు తరలింపు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : వెలుగుమట్ల భూదాన్ భూములలో ఇంటి స్థలాలు పేరుతో పేదల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడిన ముఠాసభ్యుల్లో ఒకరైన నిందితుడు కోట బాబురావును శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ ఏసిపి రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలు సెక్షన్ల కింద ముఠాసభ్యులపై కేసులు నమోదు చేసి కొందరిని ఇప్పటికే అదుపులోకి తీసుకోగా వారిలో ప్రధాన నిందితుడు పొలెబోయిన ముత్తయ్యను విచారిస్తున్నట్లు తెలిపారు.

# కడుపుకోత మిగిల్చిన గోదారమ్మ



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం సమీపంలోని ఏపిలో గల కొల్లు గూడెం గోదావరి తీరంలో ఐదుగురు విద్యార్థులు గల్లంతై దుర్మరణం పాలయ్యారు. ఈ హృదయ విదారకర ఘటన శుక్రవారం తీవ్ర విషాదాన్ని నింపింది. భద్రాచలానికి చెందిన శ్రీకర్, అభిరామ్‌తో పాటు ఏపిలోని మదనపల్లికి చెందిన సతీష్, ఉయ్యూరుకు చెందిన నవదీప్, తేజజ్ఞ, విజయనగరంకు చెందిన హర్ష, దీపక్ అనే ఏడుగురు స్నానాల కోసం గోదావరిలోకి దిగారు. లోతును అంచనా వేయలేకపోయిన వారు కొట్టుకుని పోయే క్రమంలో హర్ష, దీపక్ అనే ఇద్దరికి ఈత రావడంతో ప్రాణాలతో బయటపడగా మిగతా ఐదుగురైన శ్రీకర్, అభిరామ్, సతీష్,, నవదీప్, తేజజ్ఞ మునిగిపోయి మృత్యువాత పడ్డారు. వీరిలో ఇప్పటి వరకు భద్రాచలానికి చెందిన చారుగుళ్ల శ్రీకర్, అభిరామ్‌తో పాటు ఉయ్యూరుకు చెందిన నవదీప్ ల మూడు మృతదేహాలు లభ్యం కాగా మిగతా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**ఉగాదికి వచ్చి అనంత లోకాలకు...**

ఈ ఏడుగురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో గల ఎస్‌ఆర్‌ఎంటి ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ ద్వితీయ సం. చదువుతున్నారు. ఉగాది సందర్భంగా రామాలయం దర్శం కోసం భద్రాచలంలో ఉండే శ్రీకర్, అభిరామ్ అనే స్నేహితుని వద్దకు వచ్చి ఉగాది రోజులు రామాలయంలో దర్శనం చేసుకున్నారు. ఆరోజు శ్రీకర్ ఇంట్లో బస చేసిన ఆ మరుసటి రోజైన శుక్రవారం గోదావరిలో సెల్ఫీలు దిగి, స్నానాలు చేసేందుకు భద్రాచలం సమీపంలోని కూనవరం రోడ్‌లో గల ఏపి సరిహద్దు కొల్లుగూడెం గోదావరి తీరానికి వెళ్లారు. నదిలోకి దిగి సెల్ఫీలు తీసుకుంటున్న క్రమంలో అనుకోకుండా లోతులోకి వెళ్లిపోయిన వారు కాళ్లు అందక నీళ్లలో కొట్టుకుపోయారు. ఈత రావడటంతో ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు యువకులు 100 కు డైయిల్ చేయగా, అక్కడి నుండి భద్రాచలం పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలమైన గోదావరి తీరానికి చేరుకున్న పోలీసులు ఏపి సరిహద్దు కావడంతో ఏపిలోని ఎటపాక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు కూడా గోదావరి తీరానికి వచ్చిన గాలింపుల చర్యలు మొదలుపెట్టారు. స్థానికంగా నివాసం ఉండే శ్రీకర్ కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మిగతా విద్యార్థుల కుటుంబీకులకు కూడా సమాచారం ఇవ్వడంతో బోరున విలపిస్తూ ఆగమేఘాల మీద భద్రాచలం బయలు దేరారు. లభ్యమైన మృతదేహాలను భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రిలోగల మార్చురీకి తరలించగా, మరో రెండు మృతదేహాల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దైవదర్శనం కోసమని భద్రాచలం వచ్చిన యువకులను గోదావరి రూపంలో మృత్యువు కబళించడంతో గోదావరి తీరంలో శోక సంద్రంగా మారిపోయింది. స్థానిక యువకులు కుటుంబీకుల రోదనలు మిన్నంటుతున్నాయి. చేతి కందిన కొడుకులు గోదావరిలో కొట్టుకుపోయి మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత 30 ఏళ్ల క్రితం కిన్నెరసానిలో భద్రాచలంకు చెందిన యువకులు ఐదుగురు మృతి చెందగా, ఇప్పుడు గోదావరి తీరంలో ఐదుగురు యువకులు మృత్యువాత పడటంతో ఆ నాటి సంఘటనను పలువురు నెమరు వేసుకుంటున్నారు.

# చిట్టీల నిర్వాహకుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని జమలాపురం గ్రామానికి చెందిన చిట్టీ పాటల వ్యాపారి కొర్లకంటి రామచంద్రరావు చిట్టీ పాటలు నిర్వహిస్తూ తాము కట్టిన డబ్బులు ఇవ్వకుండా తమను మోసం చేశాడని బాధితులు శుక్రవారం ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రమేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ముందుగా బాధితులు అందరూ జమలాపురంలోని రామచంద్రరావు ఇంటి ఎదుట రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఎర్రుపాలెం పోలీసులు వచ్చి బాధితులతో మాట్లాడారు. ఎస్సై రమేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జమలాపురం గ్రామానికి చెందిన చిట్టీపాటల నిర్వాహకుడు కొర్లకంటి రామచంద్రరావు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో చిట్టీ పాటలు నిర్వహిస్తున్నారని, గత కొన్ని నెలలుగా చిట్టీలు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా తిరుగుతున్నాడని బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. జమలాపురం చుట్టుపక్కల గ్రామాలు సుమారు 90మంది వ్యక్తుల ద్వారా సుమారు మూడు కోట్లకు పైగా నగదు తీసుకుని వారికి అందుబాటులో లేకుండా పారిపోయాడని, వెంటనే రామచంద్రరావు ఆచూకి కనిపెట్టి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇప్పటికే రామచంద్రరావు ఖమ్మం ఐడి డిక్లరేషన్ చేశాడని బాధితులు ఆరోపించారు. ఎలాగైనా అతని పేరుతో జమలాపురంలో ఉన్న వెంకటేశ్వర మినీ ఫంక్షన్ హాల్‌ని రికవరీ చేసి తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. బాధితుల పక్షాన గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి, ఉపసర్పంచ్ చెట్టు పార్వతీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

# ఈద్గా స్థలాన్ని పరిశీలించిన సిపి





ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈద్గా ప్రాంతంలో ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ఈద్గా ప్రాంతాన్ని ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. ట్రాఫిక్, పార్కింగ్, భద్రతపై నిర్వాహకులతో పాటు అధికారులతో చర్చించారు. ప్రత్యేక ప్రార్థన కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సిపి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగర ఏసిపి రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు భాను ప్రకాష్, సత్యనారాయణ, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా నియమిస్తున్నట్లు అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. డిప్యూటీ సిఎం మలుల భట్టివిక్రమార్క అనుచరుడిగా ఉన్న వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి 2006లో ఎంపిటిసిగా, 2019లో సర్పంచ్‌గా గెలుపొంది గత 13 సంవత్సరాల నుండి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ పదవి దక్కడంతో మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా వారితో పాటు ఎర్రుపాలెం మండలానికి చెందిన వారిని జిల్లా కమిటీలో ప్రధాన కార్యదర్శిగా కంచర్ల వెంకటనర్సయ్య, కార్యదర్శిగా సగ్గుర్తి వెంకటనారాయణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా యన్నం లక్ష్మీను నియమించారు. ఈ సందర్భంగా వారు జిల్లా కమిటీలో స్థానం కల్పించిన సిఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సంరక్షణ, ఆరోగ్య సేవలు సమగ్రంగా నిర్వహించాలి

**-నాణ్యమైన పోషకాహారం అందించాలి**
**-బాలల సదనంను తనిఖీ చేసిన కలెక్టర్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగడం ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంచి ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టిసారించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదుగుతారని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎన్నెస్పి రోడ్డులో గల బాలల సదనాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలలో తిరుగుతూ పరిశుభ్రత, మౌలిక వసతులు, పడక గదులు, బాత్‌రూములు, త్రాగునీటి సదుపాయం, వంటగది నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం సరైన ప్రమాణాలతో అల్పాహారం భోజనం అందిస్తున్నారా వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలతో నేరుగా ముచ్చటించిన కలెక్టర్ భోజనం రుచిగా ఉందా, సమయానికి అందిస్తున్నారా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సదనాల్లో ఉన్నపిల్లలు మన కుటుంబ సభ్యులాంటి వారని వారికి అందించే ఆహారం పోషక విలువలతో కూడినదిగా రుచికరంగా ఉండాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, భద్రత అంశాల్లో ఎల్లప్పుడు అత్యున్నత ప్రమాణాలు పాటించాలన్నారు. శిశు సంరక్షణ కేంద్రాల్లో ఉన్న చంటి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని వైద్య పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యం, పోషణ భద్రతపై సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. దత్తత ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమని అర్హత కలిగిన కుటుంబాలకు మాత్రమే చట్టపరమైన విధానాల ప్రకారం పిల్లలను దత్తత ఇవ్వాలని, ప్రతి దశలో బాలల హితం ప్రాధాన్యంగా ఉండేవిధంగా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ సేవలను అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, జిల్లా శిశు సంరక్షణ అధికారిణి విష్ణు వందన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

**-బడ్జెట్‌లో మొండిచేయి**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దగ్ధం**




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని బడ్జెట్‌లో కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈసందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 8.22 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యా రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో డొల్లతనం కనిపిస్తుందన్నారు. విద్యా రంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్‌ను కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది 8.22 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.10వేల కోట్లు పెండింగ్ రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఉంటే ప్రభుత్వం మాత్రం కేవలం వాటి కోసం రూ. 4,343 కోట్లు కేటాయించిదన్నారు. ఉస్మానియా విశ్వ విద్యా లయానికి వెయ్యి కోట్లు, చాకలి ఐలమ్మ విశ్వ విద్యాలయానికి రూ.400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగిలిన విశ్వ విద్యాలయాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉన్నత విశ్వ విద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం తగదన్నారు. యంగ్ ఇండియా, సమీకృత గురుకులాలకు సుమారు ఐదు వేలు కోట్లు కేటాయిస్తే మిగిలిన ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, గురుకులాల పరిస్థితి, వసతి గృహాలు, కస్తుర్బా గాంధీ పాఠశాలల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. లేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు ఎం. లోకేష్, జిల్లా నాయకులు పవన్, గోపి, నరేందర్, సాయి, పావని, కళావతి, శశి, హేమ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతా..

**- మంగాపురం సర్పంచ్ నాగ నర్సింహారావు**



ప్రజాపక్షం/ తల్లాడ : మంగాపురం గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మంగాపురం సర్పంచ్ దుగ్గిదేవర నాగ నర్సింహారావు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బోర్ల మరమ్మత్తులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బోర్లు మరమ్మత్తులు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నో రోజుల నుంచి వెలగని లైట్లను పరిశీలించి వీధి లైట్ల సమస్య పరిష్కారం చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బంది శానిటేషన్ ప్రతి రోజు క్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డు సభ్యులు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా వచ్చి కలవచ్చని, ఎలాంటి సమస్యనైనా తనవంతు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ, పంచాయతీ కార్యదర్శి జొన్నలగట్ల పరుశురాం, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన సండ్ర



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలం పాతమిట్టపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మోరంపూడి సత్యనారాయణ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. శుక్రవారం పాత మిట్టపల్లి గ్రామంలోని వారి స్వగృహంలోని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా నూతకల్ గ్రామంలో నారపోగు జమలయ్య అల్లుడు పమ్మిరాజు ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారపోగు జమలయ్యతో మాట్లాడి వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, పెనుబల్లి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు, తల్లాడ టౌన్ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు, తూము శ్రీనివాసరావు, నాయుడు శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణరావు, బలవంతపు లోకేష్, వార్డు నెంబర్ కిన్నెర కృష్ణ, తేలపుట కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న రూ.25వేలు నగదు వృద్ధురాలికి అప్పగింత




ప్రజాపక్షం/ మధిర: మధిర పట్టణం ఎస్సీ కాలనీకి చెందిన దారమళ్ల కనకమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం ఉదయం పట్టణంలోని ఆక్సుతి వస్త్రదుకాణం సమీపంలోని ఓ కొట్టు వద్ద టీ తాగేందుకు వెళ్లి తిరిగి వెళ్లిపోయింది. తన వెంట తీసుకువచ్చిన రూ.25వేలు నగదు పోగొట్టుకుంది. ఈ విషయాన్ని గుర్తించి టీ షాపు వద్ద వచ్చి విచారించినప్పటికీ డబ్బులు దొరకలేదు. దీంతో మధిర పట్టణ సిఐ దోమల రమేష్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన బ్లూకోల్ట్ సిబ్బంది బాణావత్ కొండ, హోంగార్డ్ మధు తక్షణమే స్పందించి సిసి కెమెరా పుటేజ్ ఆధారంగా వృద్ధురాలు పోగొట్టుకున్న నగదు రోడ్డుపై పడి ఉండగా తీసుకున్న వ్యక్తిని గుర్తించి సదరు నగదును తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో వృద్ధురాలు కనకమ్మకు సిఐ దోమల రమేష్, ఎస్సై నమిత, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ కొండ, హోంగార్డ్ మధులతో కలిసి అప్పగించారు. వృద్ధురాలు పోగొట్టుకున్న నగదును తక్షణమే స్పందించి రికవరీ చేసిన కానిస్టేబుల్, హోంగార్డులను సిఐ అభినందించారు.

# దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి అమ్మవారి దేవాలయం అభివృద్ధి పనులను దేవాలయ అధ్యక్షులు పల్లపోతుల ప్రసాదరావు, రాజ్యలక్ష్మీ దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లా శ్రీనివాసరావు దేవాలయంలో సాంప్రదాయ పద్ధతిలో నీటి కోసం బోరు పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రాంభించటం జరిగింది. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ అమ్మవారి దేవాలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత ప్రాముఖ్యత పొందేందుకు ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటం జరుగుతుందని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/ తల్లాడ : ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని తల్లాడ ఆర్టీసి బస్టాండ్ మలుపు వద్ద శుక్రవారం ఆర్టీసి బస్సు ఢీకొని దగ్గల శ్రీనివాస్‌రెడ్డిఅనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 సమాచారం అందించడంతో అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తల్లాడ ఎస్సై ఎన్.వెంకటకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ జిల్లా కమిటీలో నలుగురికి చోటు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఖమ్మంరూరల్ మండలానికి ప్రాధాన్యం లభించింది. మండల నుంచి నలుగురు నాయకులు కీలక పదవులు దక్కడంతో పార్టీ వర్గాలలో హర్షం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కళ్లెం వెంకటరెడ్డికి జిల్లా వైస్ ప్రెసిడెంట్ పదవి, కేటాయించగా...సీనియర్ నాయకుడు వల్లూరి పట్టాబిరెడ్డికి జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. అలాగే కాచిరాజుగూడెం(వాల్యతండా) మాజీ సర్పంచ్ ధరవత్ బాబును జిల్లా జనల్ సెక్రటరీగా నియమించారు. ఆరెంపుల గ్రామ మాజీ సర్పంచ్ చింతమళ్ల రవికి జిల్లా స్పోక్‌పర్సన్ సెక్రటరీ బాధ్యతలు దక్కాయి. పదవులు దక్కిన వారికి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# జాలిముడిలో చేతిపంపు ప్రారంభం



ప్రజాపక్షం/ మధిర : మధిర మండలం జాలిముడి గ్రామంలో హరిజనవాడ నందు శుక్రవారం సర్పంచ్ కోటేశ్వరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రేస్ సొసైటీ సంస్థ వారి ఆర్థిక సహాయంతో గ్రామంలో రెండు చేతి పంపులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రానున్న ఎండాకాలం గ్రామ ప్రజల మంచినీటి అవసరాల కోసం ఈ రెండు చేతి పంపులకు ఆర్థిక సహాయం చేసిన గ్రేస్ స్వచ్ఛంద సంస్థ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యరమల మానస, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ప్రగతి ప్రణాళిక పనులు



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలోని 21వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ రంగా రూప శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముమ్మరంగా ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా వార్డులోని ఆరోసిఎం చర్చి, రాజీవ్‌నగర్ పరిధిలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించి కాల్వలు మూసుకుపోయిన నాళాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ పరిశుభ్రతే ప్రధానంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేయించడం ద్వారా దోమల బెడద తప్పుతుందని తెలిపారు. 21వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో ఏ సమస్య తలెత్తినా ప్రజలు తనను నేరుగా సంప్రదించాలని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటైజేషన్ ఇన్‌చార్జి ఉద్దండు, కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి రూ. 31.31 లక్షలు నష్టపరిహారం అందజేత



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తూ విధి నిర్వహణలో చేతి ని కోల్పోయిన బాధితునికి రూ. 31,31,000 నష్ట పరిహారాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా అందజేశారు. ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ తరుపున ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ ప్రాంతానికి చెందిన పరవేష్ కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. గతేడాది జులై 30న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో తన కుడి చేతిని కోల్పోయాడు. ఈ ఘటనపై సంబంధిత సంస్థకు నోటీసు జారీ చేయగా యాజమాన్యమైన ఇంజనీరింగ్ లిమిటెడ్ వారు కార్మిక నష్టపరిహారం చట్టం క్రింద రూ.31,31,000 లను డిపాజిట్ చేశారు. అట్టి నష్ట పరిహారాన్నిశుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో బాధితుడు పరవేష్‌కు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా చెక్కు రూపంలో అందజేసి అనంతరం అతని బ్యాంకు ఖాతాకు ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా వెంటనే జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాదాలు జరిగినా ఇన్సూరెన్స్ లేదా ఇతర భద్రతా అంశాల పరంగా కార్మికులకు ఇబ్బందులు ఎదురైన సందర్భంలో వెంటనే కార్మిక శాఖను సంప్రదించాలని సూచించారు. ఉప కార్మిక కమిషనర్ కె. విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇట్టి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేశారు.

## శివాలయం పునర్మిణానికి కృషిచేస్తా

**తనికెళ్ల శివాలయం చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాసరావు**



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని తనికెళ్ల శ్రీ చంద్ర మౌళేశ్వర ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మన్‌గా గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాసరావు గురువారం ఉగాది రోజు ప్రమాణస్వీకారం చేశారు. శుక్రవారం ఖమ్మం దేవాదాయధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మిట్టపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతు దేవాలయం చైర్మన్‌గా తనమీద నమ్మకంతో తనను చైర్మన్‌గా చేసినందుకు వైరా శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కొద్దిసంవత్సరాల క్రితమే శివాలయం దెబ్బతిన్నదని ఆలయాన్ని పునర్మిణాం చేయాలని గత ఏడెనిమిది సంవత్సరాలనుంచి గ్రామస్థులం అందరం కృషిచేస్తున్నామని కాని నిర్మాణానికి అనేక అడ్డంకులు వచ్చాయని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహాయ సహకారాలు, గ్రామస్థులు, గ్రామ పెద్దల సహకారంతో ఆలయం పునర్మిణానికి కృషిచేస్తానని అన్నారు. ఆలయానికి సుమారు 30 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని భూముల కౌలుద్వారా ఆలయ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని అన్నారు. తను చైర్మనగా ఉన్న సమయంలోనే పునర్మిణంతోపాటు ఆలయం అభివృద్ధికి కూడా కృషిచేస్తానని అన్నారు. అసిస్టెంట్ కమీషనర్‌ను కలిసిన వారిలో ఆయనతోపాటు పొట్లపల్లి గోపి, ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు గడల నరేంద్రనాయుడు, గుమ్మిడెల్లి వెంకటేశ్వర్లు, చల్లా బోసు తదితరులు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాక మేజర్ గ్రామ పంచాయితీలో ఇటీవల వరుసగా జరుగుతున్న గుండెపోటు మరణాలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సీపీఐ సారపాక పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఐదారు మంది వరకు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఈ పరిస్థితికి గల కారణాలు ఏమిటో స్పష్టంగా తెలియక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆయన తెలిపారు. గతంలో ఐటీసీ సంస్థ తమ సామాజిక బాధ్యతలో భాగంగా కాంట్రాక్టర్ల సహకారంతో విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాల నుండి నిపుణులైన వైద్యులను రప్పించి మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించేదని గుర్తు చేశారు. ఆ క్యాంపుల ద్వారా వేలాది మంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించేవారని చెప్పారు. అయితే ఇటీవల కాలంలో ఆ కార్యక్రమాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఐటీసీ సంస్థ తక్షణమే తమ సామాజిక బాధ్యతను గుర్తించి సారపాకలో ప్రాంతంలో మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించాలని సీపీఐ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## భద్రాద్రి జిల్లాస్థాయిలో ఎంసెట్ మోడల్ పరీక్ష

ప్రజాపక్షం/బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో 2026,27 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న ఎంసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం జిల్లా స్థాయి మోడల్ పరీక్షను ఈనెల 22న ఆదివారం ఉదయం 9గంటలకు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎస్.ఆర్ తెలిపారు. విద్యార్థులకు పరీక్ష విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక రోజు ముందుగా బ్రిలియంట్ జూనియర్ కాలేజ్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9705137128,9866283566ను సంప్రదించాలని తెలిపారు.

# పబ్లిక్ స్కూల్స్ నిర్మాణానికి డిజైన్ సిద్ధం చేయాలి

**-అధికారులతో సమీక్షించిన కలెక్టర్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిల్లా పరిధిలో ఎంపిక చేసిన తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి చేసేందుకు డిజైన్స్ సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొమ్మిది తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్య ఆధారంగా 1,000, 800 మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులను, మౌలిక వసతులను కల్పించేలా ప్రణాళికలు చేయాలన్నారు. తొమ్మిది పాఠశాలల లేఅవుట్లను పరిశీలించి జిప్లస్ వన్ పద్ధతిలో అదనపు తరగతి గదులు, ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, సంప్, కిచెన్, వాష్ రూము, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి కోసం నిధులు నాబార్డ్ నుంచి వస్తాయని నా బార్డ్ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్నారు. డిజైన్, ఉపయోగించే సామగ్రి మంచి క్వాలిటీతో ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారని ఈ అంశాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. పబ్లిక్స్ స్కూల్స్‌లో ఎంట్రీ గేట్, పార్కింగ్ ఏరియా, వివిధ భవనాలకు వెళ్లేందుకు మార్గాలు, ల్యాండ్ స్కేటింగ్, ప్రీ స్కూల్ బ్లాక్, గ్రౌండ్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ వంటి వివిధ అభివృద్ధి పనులతో కూడిన డిజైన్లు ప్రతి పాఠశాలకు రెండు నుంచి మూడు వరకు అందించాలన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ డిజైన్ మాదిరిగా పబ్లిక్ స్కూల్స్‌కు కామన్ డిజైన్ తయారు చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన తొమ్మిది పబ్లిక్ స్కూల్స్‌ను తహసీల్దార్లు పరిశీలించి అవసరమైన ల్యాండ్ సర్వే చేయించి అందుబాటులో ఉన్న పాఠశాల భూమి సరిహద్దులు ఫిక్స్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆర్కిటెక్చర్ రూపొందించిన పలు ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించి తుది డిజైన్ తయారు కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని, ప్లానింగ్ కో ఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ, హెడ్ మాస్టర్లు, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఈఈ మహేష్ బాబు, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 39 గ్యాస్ సిలెండర్లు స్వాధీనం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : అక్రమంగా నిల్వ చేసిన 39 గ్యాస్ సిలెండర్లను జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి చందన్‌కుమార్ సిబ్బందితో కలిసి మూడు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన 39 గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. రఘునాథపాలెం మీ సేవ కేంద్రంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 32 సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రఘునాథపాలెంలోని సితార హోటల్‌లో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన నాలుగు ఎల్‌పిజి సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌టిఆర్ సర్కిల్‌లో భవాని బిర్యానీ హోటల్‌లో తనిఖీలు నిర్వహించి వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న మూడు గృహ వినియోగ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. 39 సిలెండర్లను స్వాధీనం చేసుకుని మీ సేవ ఆపరేటర్ జంగాల దుర్గారావుతో పాటు హోటల్ నిర్వహకులపై 6ఎ కేసు నమోదు చేసినట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. గృహ అవసరాల కోసం మాత్రమే సరఫరా అయ్యే ఎల్‌పిజి సిలెండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని అలాంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అక్రమ కార్యకలాపాలను గుర్తించిన వారు వెంటనే జిలా పౌర సరఫరాల శాఖ కార్యాలయంకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటిలు విజయ్‌బాబు, ఎం. వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం







ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం సాయంత్రం అరంగంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ శ్రీవారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి రజత కవచ అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది పచ్చడి నివేదన చేసి ప్రసాదాన్ని భక్తులకు అందించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ పంచాంగ శ్రవణం చేసి నూతన సంవత్సరంలో ద్వాదశ రాశుల ఫలితాలను భక్తులకు వివరించారు. సాయంత్రం మంగళవాయిద్యాలు వేద మంత్రోచ్చరణల మధ్య ఆయల సంప్రదాయమైన తీర్థపు బిందెను స్వామి వారి కోనేటి నుండి తీసుకుని యాగశాల ప్రవేశం చేశారు. ఖమ్మం కెఎన్‌ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి దంపతులు, ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు దంపతులు యాగశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం సకల దేవతలను ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు ఆహ్వనిస్తూ స్వామి వారి వాహన రూపుడైన గరుడ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, శ్రీవారి పాదాలకు పంచామృత అభిషేకం చేశారు. గరుడ స్వామికి నివేదించిన గరుడ ముద్దను సంతానం కోరుకునే దంపతులకు అందించారు. సాయంత్రం 6గంటలకు గజవాహనంపై స్వామి వారు అలివేలుమంగా పద్మావతి సమేత గిరి ప్రదక్షిణ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసశర్మ, మురళీ మోహన్‌శర్మ, వెంకటరమణ, రాజీవ్‌శర్మ, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం

**- పెద్దమ్మతల్లిని దర్శించుకొన్న ఎంఎల్‌ఏ కూనంనేని**



ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్యన కొలువై ఉన్న (శ్రీకనకదుర్గ) పెద్దమ్మతల్లి దేవాలయంలో ఈ నెల19 నుండి 27వరకు జరిగే శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలను ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివారవు ప్రారంభించారు. ముందుగా దేవాలయ సాంప్రదాయం ప్రకారం మంగళవాయిద్యాలతో, వేద మంత్రాలతో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి, దేవస్థాన వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా ఆలయంలో ఎంఎల్‌ఏ కలశ స్థాపన, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ఋత్విక రణ, దీక్షావస్త్రధారణ, అఖండ దఫారాధన, మంటపారాధనలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు,హోమములు అర్చకులచే నిర్వహించారు.అనంతరం ఎంఎల్‌ఏ కూనంనేని అర్చకులకు దీక్షావస్త్రాలను అందజేశారు. ఎంఎల్‌ఏ వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, కొత్తా వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయి బాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, మునిసిపల్ కార్పోరేటర్‌లు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, దుగ్గిరాల సుధాకర్, చెరుకూరి శేఖర్ బాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, వీసంశెట్టి పద్మజ, నిమ్మల రాంబాబు, సర్పంచ్‌లు తేజావత్ వినోద్‌ర్భూన్సీ, బానోత్ విజయ, నాయకులు మాలోత్ హరి, వేములపల్లి రాజశేఖర్, వైఎస్ గిరి, ఆలపాటి ప్రసాద్, భూక్యా రమేష్, ధర్మసోత్ రాందాస్, లావుడ్యా చందూలాల్, మాలోత్ సక్రు, మిట్టు ఆదినారాయణ, లాల్‌పాషా, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ సీడ్స్‌తో నిండా మునిగిన రైతన్నలు..!

**-100 మంది రైతులు, 500 ఎకరాలు**
**-బాధితులుగా మారిన 7 గ్రామాల రైతులు**
**-చేతులెత్తేసిన డీలర్, కంపెనీ**
**-న్యాయం చేయాలంటున్న రైతులు,**
**-డీలర్ కంపెనీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**






ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి మండలంలో శ్రీరామ్ సీడ్స్ "ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా)" వరి విత్తనాలతో సాగు చేసిన రైతన్నలు నిండా మునిగారు. మండల పరిధిలోని గౌరిగూడెం, భీమవరం, సిద్దారం, రేజర్ల, తుమ్మూరు, లింగపాలెం, సదాశివునిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 100 మంది రైతన్నలు 500 ఎకరాల్లో శ్రీరామ్ సీడ్స్ వారి ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా) నూతన వంగడంతో సాగు ప్రారంభించారు. అయితే తీరా పంట చేతికందే సమయానికి వరి కంకుల్లో తాలు వడ్లు వస్తుండటంతో రైతన్నలు ఖంగు తిన్నారు. ఇదేమిటని విత్తనాలు అందించిన వెంకటరమణ సీడ్స్ షాపు డీలర్ కడవకొలు ప్రసాద్ ను ప్రశ్నించటానికి శుక్రవారం రైతులంతా వరి కంకులతో పట్టణంలోని డీలర్ షాపు వద్దకు రాగా అప్పటికే డీలర్ పరారయ్యారు. దీంతో ఆగ్రహించిన రైతులు షాపు ముందు బైటాయించి, నినాదాలు చేశారు. ఈ సందర్బంగా రైతులు మాట్లాడుతూ తాము ప్రతిసారి వేసే వంగడాలను కాకుండా, ఈసారి డీలర్ శ్రీరామ్ సీడ్స్ వారి నూతన వంగడాలు అద్భుతంగా ఉన్నాయని బిడ్డని సాగు చేస్తే అధిక దిగుబడి రావటంతో పాటు లాభాలు పక్కాగా వస్తాయని తమను నమ్మించాడని వాపోయారు. తీరా పంట చేతికందే సమయానికి తాలు రాగా ఇదేమిటని ప్రశ్నిస్తే మొదట్లో చక్కగా సమాదానం చెప్పాడని పరిశీలిద్దామని, తప్పుజరగదని,విషయాన్ని కంపెనీ దృష్టికి తీసుకెళ్తానన్నారని రైతులు తెలిపారు. ఈ క్రమంలో ఒక ఎకరం, రెండు ఎకరాలలో బయటపడిన లోపం రాను, రాను సుమారు 500 ఎకరాలలో బట్టబయలైందని. వరి కంకుల్లో 60 శాతం కంటే ఎక్కువ తాలు గింజలు ఉన్నట్లు గుర్తించామని రైతులు వాపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే సమయానికి తాలుగా కనిపిస్తుంటే గుండె బరువెక్కుతుందని, బాధిత రైతులమంతా వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయగా, అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పరిస్థితిని అంచనా వేసిందని. ప్రాథమికంగా విత్తనాల్లో నాణ్యత లోపం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు చేసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని, నకిలీ విత్తనాల వల్ల తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని వాపోయారు. యజమానిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తమకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ అధికారిని వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని మంగళవారం శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని, విత్తనాల లోపాలు బహిర్గతమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మందపాటి ముత్తారెడ్డి, మోరంపూడి ప్రభాకర్ రావు, మోరంపూడి ప్రసాద్, కంచర్ల రమేష్, గుత్తా వసంతరావు, ములకలపాటి సత్యనారాయణ, లింగారెడ్డి రామారావు, వేంపాటి వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణరెడ్డి, బాల నాగేశ్వరరావు, చేదమళ్ళ దేవయ్య, సిద్దినబోయిన సత్యనారాయణ, అక్కినేను వెంకటేశ్వరరావు, దేవగిరి కేశవరెడ్డి, మరిడి శ్రీనివాసరావు తదితర రైతులున్నారు.

# రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి




ప్రజాపక్షం/నేలకొండపల్లి : అర్హులైన మండల రైతులు రైతు భరోసా కి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి ఎం. రాధ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమెమాట్లాడుతూ, మండలంలో ఫిబ్రవరి 28వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన 585 రైతు భరోసా కి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపినారు. గతంలో రైతు భరోసా నిధులు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు. కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు పాస్ బుక్ జిరాక్స్ లేదా డిజిటల్ సైన్ ఆన్లైన్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ మరియు దరఖాస్తు ఫారం కి జత చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు అందజేయాలని కోరారు. దరఖాస్తు చేయడానికి ఈనెల 25న చివరి తేదీ అని తెలిపారు. కావున రైతు సోదర సోదరీమణులు కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చినవారు అందరూ దరఖాస్తు అందజేయాలని తెలిపారు. చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి ఎం. రాధ కోరినారు. మన మండలంలో ఫిబ్రవరి 28వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన 585 రైతు భరోసా కి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపినారు. గతంలో రైతు భరోసా నిధులు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు. కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు పాస్ బుక్ జిరాక్స్ లేదా డిజిటల్ సైన్ ఆన్లైన్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ మరియు దరఖాస్తు ఫారం కి జత చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు అందజేయాలని కోరారు. దరఖాస్తు చేయడానికి ఈనెల 25న చివరి తేదీ అని తెలిపారు. కావున రైతు సోదర సోదరీమణులు కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చినవారు అందరూ దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

## కొలతల ప్రకారం పనులు చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : ఉపాధి హామీ కూలీలు రోజుకు రూ.307/లు వేతనం పొందే విధంగా కొలతల ప్రకారం పనులు చేయాలని పిడి రమణ అన్నారు. కేశవాపురం గ్రామ పంచాయితీ పరిధి కుందేటితోగు చెరువు పూడిక తీత పనులను, కేశవాపురం, జగన్నాధపురం లోని నర్సరీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందన్నారు. దీనితో కూలీలు ఉదయం 6 నుండి 11 గంటల వరకు మాత్రమే పనిచేయాలని సూచించారు. పనికి వచ్చిన వెంటనే ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు వేసుకోవాలని, నాలుగు గంటలకు తిరిగి మరోసారి హాజరు పంపించిన తరువాత మాత్రమే పని ప్రదేశం నుండి వెళ్ళిపోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ చెన్నకేశవులు, ఏపిఓ పోరండ్ల రంగా, కార్యదర్శులు క్రిష్ణవేణి,రాంబాబు, వంశీక్రిష్ణ, క్షేత్ర సహాయకులు శంకర్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా భాను శ్రీ ఫైనాన్షియల్ సర్వీసెస్



ప్రజాపక్షం/కారేపల్లి: పాత కమలాపురం మాజీ సర్పంచ్ తేజావత్ బాబురావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను భాను శ్రీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రతినిధులు కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా చంద్రు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబానికి 25 కిలోల బియ్యం సంచిని అందజేశారు. అదే విధంగా భవిష్యత్తులో అవసరాల సమయంలో తమవంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో భాను శ్రీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ బిజినెస్ లీడర్, సీఈఓ, బిజినెస్ లీడర్ కావేరి రమేష్, అడ్వైజర్లు శివాజీ, సురేష్, చంద్రు ఫౌండేషన్ సీఈఓ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని మేకల తండాలో ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబ సభ్యులను సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి భూక్యా శివ నాయక్ శుక్రవారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బానోత్ వెంకట్రావ్, ఆంగోత్ రమేష్ మరణం పార్టీకి, వారి కుటుంబాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎఫ్టీయూ సంఘ సభ్యుడిగా వెంకట్రావ్ ఎంతో నిజాయితీగా పని చేసి ప్రతి కార్యక్రమంలో ముందుండేవారని గుర్తు చేశారు. అలాగే ఆంగోత్ రమేష్ తన ఇంటర్మీడియట్ తరగతి సహచరుడని, విద్యార్థి దశ నుంచే పిడిఎస్‌యూ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ పోరాటాల్లో కూడా రమేష్ చురుగ్గా పాల్గొని సంఘం పిలుపునిస్తే ముందుండేవారని కొనియాడారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు కార్యకర్తలు వేర్వేరు కారణాలతో మరణించడం బాధాకరమని పేర్కొంటూ బాధిత కుటుంబాలకు పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## సీతారాముల కళ్యాణానికి ప్రత్యేక రైళ్లు నడపాలి

ప్రజాపక్షం/కారేపల్లి: భద్రాచలంలో ఈనెల 27న జరగనున్న శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి ప్రత్యేక రైళ్లను నడపాలని సామాజిక కార్యకర్తల ఇందుర్తి సురేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం సింగరేణి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది శ్రీరామనవమి రోజున భద్రాచలంలో ఈసీతారాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని, ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. ఈ సంవత్సరం అయినా రైల్వే అధికారులు స్పందించి సికింద్రాబాద్ నుండి భద్రాచలం రోడ్, విశాఖపట్నం నుండి భద్రాచలం రోడ్, తిరుపతి నుండి భద్రాచలం రోడ్, బల్లార్షా నుండి భద్రాచలం రోడ్ మార్గాల్లో డోర్నకల్, కారేపల్లి జంక్షన్ మీదుగా వారం రోజుల పాటు ప్రత్యేక రైళ్లు నడిపితే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

## గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ప్రజాపక్షం/బూర్గంపాడు: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఐసిడిఎస్ అధికారులు పర్యవేక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బూర్గంపాడు మండలం శ్రీరాంపురం ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో రేవతి శుక్రవారం సందర్శించి అక్కడి సేవలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ సక్కుబాయి, అంగన్వాడీ టీచర్ జి సులోచన, అంగన్వాడీ హెల్పర్ కె కృష్ణకుమారి, భారతి, గ్రామ పెద్ద చంద్రయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిల్లులు చెల్లించాలని మున్సిపాలిటీ చుట్టూ ప్రదక్షిణలు..!

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీల బిల్లుల కోసం ఎదురుచూస్తున్న జెసిబి నిర్వాహకులు హోటల్స్ నిర్వాహకులు ప్రతిరోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు తప్ప వారికి ఎలాంటి బిల్లులు అందడంల ఏదు అనే వాదన వినిపిస్తున్నాయి. వైరా మున్సిపాలిటీలో బిల్లులు రావాల్సిన కొంతమంది జెసిబి నిర్వాహకులు, హోటల్ నిర్వాహకులు చెప్పులు అరిగేదాకా వైరా మున్సిపాలిటీ చుట్టూ తిరుగుతున్నారు తప్ప నిధులు మాత్రం ఇవ్వడం లేదని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నికల ఖర్చు అంటూ మున్సిపాలిటీఓలని జనరల్ ఫండ్‌ను పూర్తిగా ఊడ్చి వేసినట్లు చేసినట్లు సమాచారం. ఎన్నికల కోసం ప్రభుత్వం కొన్ని లక్షల రూపాయల నిధులను మున్సిపాలిటీల పరిస్థితిని పరిమాణాన్ని బట్టి విడుదల చేసింది. అయితే ఆ సమయంలో ఎన్నికల నిర్వహణ కోసం, ఇంతక ముందు మున్సిపాలిటీ కార్యక్రమాల కోసం పలువురు హోల్స్ నిర్వాహకులు భోజనాలను పెట్టి ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన వస్తుంది. గత కొన్ని నెలల క్రొతం వైరా మున్సిపాలిటీలో రోడ్లపై ఉన్న గుంటలను పూడ్పించడానికి జెసిబిలను పనిలోకి తీసకున్న తర్వాత వారికి డబ్బులు ఇవ్వకుండా నెలలు గడుస్తున్న ఆఫీసును చుట్టూ తిప్పిస్తున్నారు. కమీషనర్ తీరు పట్ల పలువురు ఆగ్రహం కూడా వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు కోసం అడిగితే కనీసం మున్సిపల్ డిఈకి ఏఈకి కూడా సమాచారం లేకుండా కమీషనర్ సొంత నిర్ణయం తీసుకొని మట్టి తోలించాడని మాకు సంబంధం లేదని ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ చెబుతూ ఉంది. కమీషనర్ గురులింగం కూడా పనిచేయించుకున్న వారికి డబ్బులు ఇవ్వకపోవడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తుంది. అసలు మున్సిపాలిటీలోకి ఎన్నికల నిమిత్తం వచ్చిన డబ్బులు ఎంత వాటిని ఏ విధంగా ఖర్చు చేశారు అని అడగడానికి ఎక్కడ ఎలాంటి ఆధారాలు ఉండవు కాబట్టి ఇష్టానుసారంగా ఖర్చు చేశారని వాదనలు వినిపిస్తున్నాయి.




### వామ్మో వైరా మున్సిపాలిటీ...

వైరా మున్సిపాలిటీ పేరు చెబుతానే ఎవరు పన్నులు చేయడానికి రావడానికి గాని ఇతరత్న కార్యక్రమాల్లో సంబంధించి పనులు చేపించడానికి కాని రావడానికి భయపడాల్సిన పరిస్థితి మున్సిపాలిటీలో ప్రస్తుతం నెఉలకొంది అని చెప్పవచ్చును. ఏ పని చేసిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఇబ్బంది పెట్టి తిప్పుతారని, తిరిగి తిరిగి వారు వదులుకోవాల్సిన పరిస్థితి కూడా ఈ మున్సిపాలిటీలో ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. అసలు బాద్యత గల అధికారులు మున్సిపాలిటీలో ఏదైనా పనులు చేయడానికి పెట్టుకున్నప్పుడు అది జేసిబిల నిర్వాహకులు కావచ్చు. ఇతరత్రా కూలీలు కావచ్చు, భోజనాలకు కావచ్చు, కాని ఎందుకు ఆ డబ్బులను ఇవ్వలేకపోతున్నారు. మున్సిపాలిటీ ఖజానా నుంచి డబ్బులు డ్రా చేస్తున్నారా, చేస్తే ఎంత డ్రా చేస్తున్నారు. ఎంత ఇస్తున్నారు అనే దానిపై ఒక స్పష్టత కూడా లేదని చెప్పవచ్చును. మున్సిపల్ కమీషనర్ గురులింగం తీరు పట్ల కూడా పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పనులకు సంబంధించి డబ్బులు కావాలి అని అడిగితే కూడా స్పందన సక్రమంగా ఉండడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ వైరా మున్సిపాలిటీని ఊడ్చేశారు అనే ప్రచారం జరుగుతుంది.

# గ్యాస్ కొరత లేకుండా చూడండి

**మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామం వద్ద ఉన్న ఇండియన్ గ్యాస్ గోడాన్‌పై వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ స్థానిక వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్ సూచనల మేరకు సందర్శించి వైరా మండల ప్రజలకు, వైరా మున్సిపాలిటీలోని ప్రజలకు గ్యాస్ సప్లై చేయడంలో జరుగుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వైరా మండలంలోని, మున్సిపాలిటీలోని గురుకుల పాఠశాల అయిన టిఎస్‌ఆర్ఎస్ జూనియర్ కళాశాల, టిఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల, ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్ఎస్ రెబ్బవరం నందు గల ఉన్న గురుకుల పాఠశాలకు కచ్చితంగా గ్యాస్ సప్లై అందించాలని పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి ఆటంకం కలిగించకూడదని స్థానిక కళాశాలల ప్రధానోపాధ్యాయులు స్థానిక శాసనసభ్యులకు కోరగా వారి సూచన మేరకు గ్యాస్ గోడాన్ సందర్శించిఅక్కడ పనిచేస్తున్న అధికారులకు



గ్యాస్ కొరత లేకుండా చూడాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తెలియజేశారు. అదేవిధంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని, వైరా మండల ప్రజలు కూడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా గ్యాస్ అప్లై చేయాలని ఆయన వారికి సూచించారు.

# ఆగని అడుగులు..!

**-జీవితంతో పోరాడి లేచిన వినయ్**
**-ప్రభుత్వం ప్రోత్సహిస్తే తన కాళ్లపై తానే నిలబడతానంటున్న వినయ్**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అందరూ... యువకుల్లానే అతనూ భవిష్యత్తుపై పెద్ద కలలు కన్నాడు. కుటుంబ పరిస్థితులను మార్చాలనే సంకల్పంతో ఉద్యోగాన్వేషణలో అడుగులు వేశాడు. కానీ అనుకోని ప్రమాదం అతని జీవితాన్ని ఒక్కసారిగా తారుచామారు చేసి ఆ అడుగులను ఆపింది. తాను ఒకటి తలిస్తే విధి ఒకటి తలచింది. ఓ యాక్సిడెంట్‌తో యవ్వనంలోనే మంచానికి పరిమితమయ్యాడు. అయినప్పటికీ అక్కడే ఆగిపోలేదు. తనలోని అంచలంచలమైన పట్టుదలతో జీవితాన్ని మళ్లీ గెలుచుకునే పోరాటాన్ని ప్రారంభించాడు. మంచం మీద నుంచే తన జీవితాన్ని తిరిగి నిర్మించుకోవాలనే సంకల్పంతో ముందుకు అడుగులేస్తున్నాడు. తన కథతో ఇతర యువతకు ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం, సహాయం లభిస్తే తన కాళ్లపై తానే నిలబడగలనని విశ్వాసంగా చెబుతున్నాడు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డుకు చెందిన నంబూరి వెంకటేశ్వర్లుగోపమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు. తండ్రి లారీ క్లీనర్‌గా పని చేస్తుండగా తల్లి ఇంటింటికి తిరిగి పాలమ్మి కుటుంబాన్ని సాగుతుంటుంది. పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడిని డిగ్రీ వరకు చదవించినప్పటికీ ఆర్థిక స్తోమత సరిపోక అక్కడితో బంద్ చేపించారు. అయితే కుటుంబానికి కొంత ఆర్థిక చేయూతగా ఉండాలనే ఉద్దేశంతో ఏడు సంవత్సరాల క్రితం నిజామాబాద్‌లో ఓ కంపెనీలో సూపర్‌వైజ్‌కు పని కుదిరాడు. ఈ క్రమంలో అనుకోకుండా ఓ రోజు ప్రమాదం సంభవించి తలకు గాయం అయ్యింది. అటు తర్వాత ఒక నెలరోజుల వరకు ఆసుపత్రిలోని బెడ్‌పై కోమాలో ఉన్నాడు. అటు తర్వాత కోలుకున్నప్పటికీ తలకు బలమైన గాయం కావడంతో శరీర నరాలు చచ్చుబడిపోయాయి. ఈ నేపథ్యంలో ఇంట్లోనే ఓ బెడ్‌పై ఆరు నెలల వరకు ఉండిపోయాడు. అలా ఉంటూనే చిన్న చిన్నగా శరీరంలోని ఒక్కొక్క భాగాన్ని కదిలిస్తూ వాకర్ పట్టుకొని అడుగులు వేయడం ప్రారంభించాడు. అలా మొదలైన సంకల్పం ఒంటరిగా ప్రతిరోజు 10కిలోమీటర్ల వరకు వాకింగ్ చేసే ఆత్మస్థైర్యాన్ని నింపింది.

### ప్రభుత్వం ప్రోత్సహిస్తే...

జీవితంలో ఎదురైన కష్టాలను అధిగమిస్తూ తన కాళ్లపై తనే నిలబడేందుకు సిద్ధమవుతున్నాడు. అవకాశం ఇస్తే తన స్వయం శక్తితో ముందుకు సాగి జీవితంలో ధైర్యంగా నిలబడి కుటుంబానికి అండగా నిలుస్తాన్నంటున్నాడు. అనుకోని పరిస్థితులు అతనని నిరాశలోకి నెట్టిన తనలోని నమ్మకంతో ముందుకు సాగాలనే సంకల్పంతో ఉన్నాడు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రోత్సహించి కొంత సహాయం లభిస్తే తన కాళ్లపై తానే నిలబడగలననే ఆశభావం వ్యక్తం చేస్తున్నాడు. ఆపదలో అండగా నిలిచిన కుటంబాన్ని సాకడమే తన లక్ష్యం అంటున్నాడు. ఇతరులకు భారంగా కాకుండా స్వయం ఉపాధితో జీవించాలని అతని పట్టుదలగా కపిస్తోంది. ఇందుకు పెద్ద పెద్ద కోరికలు కాకుండా దాతలు దయ చూపితే ఓ బైక్ కొన్నుక్కోవాలని ఉందని ఎంతో ఆశగా అడుగుతున్నాడు.

# వెంకటరమణ సీడ్స్‌పై చర్యలు తీసుకోండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయిన గౌరిగూడెం, సిద్ధారం, సదాశివునిపేట, భీమవరం, తుమ్మూరు, లింగపాలెం తదితర గ్రామాల రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. వెంకట రమణ సీడ్స్ డీలర్ సరఫరా చేసిన నాసిరకం విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన పేర్కొన్నారు. ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# నేడే రంజాన్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆకాశంలో నెలవంక దర్శనంతో ముస్లింల పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగియగా, నేడు ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. శుక్రవారం చివరి రోజుగా ఉపవాసం పాటించిన ముస్లింలు, శనివారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. రంజాన్ మాసం మొత్తం నియమ నిష్టలతో ఉపవాసాలు పాటించిన భక్తులు, ప్రార్థనలు, దానధర్మాలు, ఖురాన్ పఠనంతో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకున్నారు. సూర్యోదయానికి ముందే 'సుహూర్'తో ఉపవాసం ప్రారంభించి, సూర్యాస్తమయం తర్వాత 'ఇఫ్తార్'తో ముగించే ఈ ఆచారం నెల రోజుల పాటు కొనసాగింది. ఉపవాసాల ముగింపునకు గుర్తుగా జరుపుకునే ఈద్ ఉల్ ఫితర్ మానవతా విలువలు, దాతృత్వం, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ సందర్భంగా మసీదులు ప్రత్యేక అలంకరణతో కళకళలాడుతుండగా, ప్రార్థనల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకోనున్నారు.

# రైతులు పాడి పరిశ్రమతో అభివృద్ధి సాధించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు పాడి పరిశ్రమతో అభివృద్ధి సాధించాలని పశుసంవర్ధక శాఖ ఖమ్మం డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ రమణి సూచించారు. మండలంలోని తిరుమలాపురం పంచాయతీ లో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం ను సర్పంచ్ ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు పశువులకు టీకాలు వేయించాలని సూచించారు పశువుల ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతులు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని సూచించారు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు రైతులు పాడి పరిశ్రమతో అభివృద్ధి సాధిస్తారని సూచించారు. పశుసంపదన కాపాడేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఏడి శ్రీనివాసరావు, చెరువు మాదారం వైద్యాధికారి డాక్టర్ సాహిత్య, సర్పంచ్ కమదన ప్రవీణ్, అసిస్టెంట్ వెటరన్ డాక్టర్ తాటి రామారావు, గోపాల మిత్రులు ఎడవల్లి నరసింహారావు, బోయపాటి నారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందిన, నేలకొండపల్లి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన భూక్య భిక్షాలు కు తిరుమలాపురం గ్రామ సర్పంచ్ కమదన ప్రవీణ్ సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. గురువారం గ్రామంలోని బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులు తెలంగాణ ప్రభుత్వం సీఎం సహాయనిధి పరిహారం మరింత పెంచాలని కోరారు. బాధితులు దరఖాస్తు చేసుకున్నంత ఇవ్వడం లేదని దాని వలన బాధితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కావున ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నీ పెంచాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రిజ్ పేలి లక్ష రూపాయల ఆస్తినష్టం



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిదిలోని తూతకలింగన పేటలో శుక్రవారం ఉదయం నల్లగొర్ల సత్యనారాయణ ఇంట్లో ఒక్కసారిగా ఫ్రిజ్‌పేలింది. దీంతో పెద్ద వబ్బంతో మంటలు వ్యాపించి ఇంట్లోని మిక్సి, గ్రైండర్ తోపాటు వంట సామాన్లు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. ఇంటి గోడలు సైతం పాక్షింగా దెబ్బతిన్నాయి. ఇది గమనించిన చుట్టుప్రక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ శ్రీనివాసరావు పరిశీలించి వివరాలు సేకరించారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్, విశ్వబ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షుడు రుద్రాక్షల నాగాచారి తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనలో సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు నల్లగొర్ల సత్యనారాయణ తెలిపారు.

# అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

-ముగ్గురు నిందితులు అరెస్ట్.. తప్పించుకున్న మరో ముగ్గురు..
-వాహన తనిఖీల్లో 105.54 కేజీల గంజాయి స్వాధీనం
-పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 52,77,000
-రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లు, స్వాధీనం..
-విలేకరుల సమావేశంలో వెల్లడించిన డీఎస్పీ ఆదినారాయణ






**ప్రజాపక్షం/జూలూరుపాడు:** గుట్టు చప్పుడు కాకుండా ఆంధ్ర రాష్ట్రం కలిమెల్లి, డొంకరాయి నుంచి షిరిడీ కి తరలిస్తున్న ఎండు గంజాయిని బుధవారం జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం జూలూరుపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను డీఎస్పీ సందర్శించి, పట్టు బడిన గంజాయి వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ మార్చి 18వ తేదీ సాయంత్రం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమ్మదగిన సమాచారంతో స్థానిక పోలీసులు, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన టీఎస్ 11 ఈఆర్ 6312, టీఎస్ 07 జె వై 3959 నంబర్లు కలిగిన కార్లలో ముగ్గురు వ్యక్తులు వస్తుండగా వాహనాలను ఆపి పోలీసులు తనిఖీలు జరపగా 52 ప్యాకెట్లల్లో 105.54 క్వింటాలు గంజాయి ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. తనిఖీల్లో పట్టుబడిన గంజాయి విలువ రూ 52,77,000 ఉంటుందన్నారు. రెండు కార్లల్లోనీ ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా డొంకరాయి నుంచి నిషేధిత ఎండు గంజాయిని ప్యాకెట్ల రూపంలో భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు, ఖమ్మం, హైద్రాబాద్ మీదుగా షిర్డీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి అక్రమ రవాణాలో నల్లగొండ జిల్లా మర్రి గూడెం మండలం, ఎర్రగాళ్ల పల్లి గ్రామానికి చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్, నల్లగొండ జిల్లా, దేవరకొండ, ఖిల్లా బజారుకు చెందిన బైరిశెట్టి భార్గవ్, రంగారెడ్డి జిల్లా, వనస్థలిపురం, బిఎన్ రెడ్డి నగర్ కు చెందిన అంధేకర్ శ్రీనివాస్ తోపాటు నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు అభి, లక్ష్మణ్, షారుక్ పరారీలో ఉన్నారని ఆదినారాయణ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2025 జనవరి నెల నుంచి ఇప్పటి వరకు 6844 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, దీని విలువ రూ 34 కోట్ల ఏడు లక్షల రూపాయలు ఉంటుందన్నారు. పోలీసులు 86 గంజాయి కేసులను నమోదు చేశారని డీఎస్పీ వివరించారు. అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన కొత్తగూడెం సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు ఆదినారాయణ తెలిపారు. విలేకరుల సమావేశంలో జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, ఎస్ఐ బాదావత్ రవి, ఏఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కూసుమంచిలో గ్యాస్ దందా..!

-హోటళ్లకు తరలుతున్న గ్యాస్ సిలిండర్లు



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలో గ్యాస్ సరఫరా వ్యవస్థ పూర్తిగా గందరగోళానికి గురైంది. గృహ వినియోగానికి కేటాయించిన డొమెస్టిక్(ప్రభుత్వ రాయితీ కలిగిన) సిలిండర్లు ప్రజలకు అందకుండా పోతుండగా, అదే సమయంలో వ్యాపార సంస్థల్లో అవే సిలిండర్లు విస్తృతంగా వినియోగంలో ఉండటం తీవ్ర అనుమానాలకు దారితీస్తోంది. బుకింగ్ చేసిన గ్యాస్ కోసం ప్రజలు రోజులు, వారాల పాటు ఎదురు చూస్తున్నా సరఫరా జరగడం లేదు. మరో వైపు కొంత మంది గ్యాస్ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధిక ధరలకు సిలిండర్లు విక్రయిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర వ్యాపార సంస్థలకు కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లనే భారీగా మళ్లిస్తున్నట్లు సమాచారం. దీని వల్ల గృహ వినియోగదారులకు అందాల్సిన గ్యాస్ సరఫరా తీవ్రంగా దెబ్బతింటోంది.

**రెండు సిలిండర్లు ఒకే చోట....**

ఇంకా ఆశ్చర్యకరమ విషయం ఏమిటంటే వ్యాపారాలు డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లను ఒకే చోట ఉంచి ఒక వేళ ఎవరైనా అధికారులు వస్తే మేము కమర్షియల్ సిలిండర్ వాడుతున్నామంటూ చెప్పడానికి అధికారులను తప్పుదారి పట్టించడానికి గ్యాస్ లేని కమర్షియల్ సిలిండర్ ఒకటి గ్యాస్‌తో ఉన్న డొమెస్టిక్ సిలిండర్ ఒకే చోట ఉంచడం అనేక ఆరోపణలు దారి తీస్తుంది. అసలు పౌర సరాఫరా శాఖ అధికారుల తనిఖీలు నిజంగా అమలవుతున్నాయా...లేక కేవలం చూపు కోసం జరుగుతున్నాయా అన్న ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.

**ప్రజలు కోరే తక్షణం చర్య ఏమంటే....**

కూసుమంచి మండలంలో నిర్వహిస్తున్న గ్యాస్ ఏజెన్సీల సరఫరాపై తక్షణ ప్రత్యేక దర్యాప్తు జరపాలని ప్రజలు కోరుతున్నారు. ఇంకా మండలంలో కొన్ని గ్రామాల్లో కొన్ని సెంటర్లలో గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేసుకునే అడ్డాలు అనేకం ఉన్నాయి. వాటిపై ఇంకా బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కూసుమంచి మండల కేంద్రంలో పాటు ప్రధాన రహదారి పై గ్రామాల్లో నిర్వహిస్తున్న హోటల్‌లో టీ సెంటర్‌లో మొదలైన చోట్ల డొమెస్టిక్ సిలిండర్ల మళ్లింపుపై పూర్తి స్థాయి నియంత్రణ జరపాలని హోటళ్లలో కమర్షియల్ సిలిండర్ల వినియోగం తప్పని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇంకా నిర్లక్ష్య అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సఫీయా మజీద్ అధ్యక్షుడిగా సాబేర్ ఖాన్

**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల కేంద్రం లో శుక్రవారం సఫీయా మజీద్ లో ముస్లింల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మజీద్ కమిటీ నూతన అధ్యక్షుడుగా పఠాన్ సాబేర్ ఖాన్, ఉపాధ్యక్షుడుగా షేక్ యాకూబ్ పాషా,



కార్యదర్శి గా షేక్ యాకూబ్ పాషా, క్యాషియర్ ఎస్ కే ఖలీల్, కోశాధికారి ఎస్ కే సోనీలతో పాటు మరి కొందరిని నూతన కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఈ కార్యక్రమంలో పఠాన్ అక్బర్ ఖాన్, సాదిక్, సలీమ్, అజ్మత్, అఫ్రోజ్, రోహిత్, ఖలీల్, అజ్జు, ఇర్ఫాన్, జాహీద్, ఇలీయాజ్, రియాజ్, జలీల్, ఖలీమ్ పాల్గొన్నారు.

## వెంకటేష్‌ను పరామర్శించిన మెచ్చా

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిలో గాయపడిన పద్ధం వెంకటేష్‌ను అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఎ, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు.



ప్రస్తుతం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం డీఎస్పీ ఎల్ ఆదినారాయణను కలిసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలు భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో తుంగారం సర్పంచ్ ప్రవీణ్ ప్రకాశ్, మాజీ సర్పంచులు పూసం వెంకటేశ్వర్లు, అంజన్‌రావు, ఉప సర్పంచ్ బానోతు బాలు, నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, సత్తి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## చేపల చెరువు వద్ద వివాదం..!

-దాడి చేశారంటూ సొసైటీ అధ్యక్షుడు ఫిర్యాదు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చేపల చెరువు వద్ద ఇరువర్గాల పంచాయతీ చిలికి చిలికి గాలి వానగా మారుతుంది. అర్ధరాత్రి జరిగిన వివాదంలో తన పై దాడి చేశారని సోసైటీ అధ్యక్షుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా చేపలు పడుతున్నారని మరో వర్గం ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని బైరవునిపల్లి చెరువు వద్ద మంగళవారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మత్స్యసహాకార సంఘం అధ్యక్షుడు మల్లెబోయిన సైదులుమంగళవారం అర్ధరాత్రి చేపల చెరువు వద్దకు వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన కొంత మంది చెరువు వద్దకు వెళ్లి అధ్యక్షుడు తో గొడవపడ్డారు. చెరువులో అర్ధరాత్రి అక్రమంగా చేపలు పడుతున్నారని తెలిసి చెరువు వద్దకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. పాలకవర్గం తీర్మానం, సభ్యుల అనుమతి లేకుండా అర్ధరాత్రి చేపలు వేట సాగిస్తున్నారని గతంలో కూడ జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఇదేమని అధ్యక్షుడు ను అడిగేందుకు వెళ్లిన తమ పై అసభ్యకరమైన పదజాలంతో దూషించారని, ఈ నేపధ్యంలో ఇరువర్గాల మధ్య వివాదం తారా స్థాయి కి చేరుకుంది. ఈ నేపథ్యంలో తన పై గ్రామానికిచెందిన వారు దాడి చేశారని ఐదుగురు పై సోసైటీ అధ్యక్షుడు బుధవారం స్థానిక పోలీసే స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాగా సోసైటీ అధ్యక్షుడు ఏకపక్షంగా అర్ధరాత్రి చేపలు పడుతున్నారని... అడిగినందుకు తమను దూషిస్తున్నారని మరో వర్గం ఫిర్యాదు చేశారు. మొత్తం మీద గ్రామంలో ఇరువర్గాల మధ్య వివాదం నేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వివాదం లో రాజకీయం చోటు చేసుకుందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయం పై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే మరి.

## నేడు ఈద్..ఉల్...ఫితర్ రంజాన్

**ప్రజాపక్షం/కామేపల్లి:** ముస్లింలు రంజాన్ మాస నెల వంక కనిపించగానే తరావీ నమాజ్తో రంజాన్ నెల ఆరంభమవుతుంది. 30 రోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం మళ్లీ నెలవంక కనిపించిన మరుసటి రోజు ఈద్.. ఉల్.. ఫితర్ రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటారు. ఈ నెలలో ముస్లింలు ఎక్కువ పుణ్య ఫలాలను సంపాదించుకుంటారు, తోటి పేద ముస్లింలకు దాన ధర్మాలు చేస్తారు. జకాత్,



చిత్రాలను చెల్లిస్తారు. సూర్యోదయాన్ని కంటే ముందు మొదలుకొని, సూర్యస్తమయం వరకు ఎలాంటి ఆహార పానీయాలు కానీ, కనీసం నోటిలో లాలాజలం కూడా మింగకుండా కఠోర ఉపవాసం పాటిస్తారు. 30 రోజుల కఠోర ఉపవాసం అనంతరం, ఈద్గాలలో ఈద్..ఉల్..ఫితర్ రంజాన్ పండుగను జరుపుకుంటారు. ఒకరికి ఒకరు ఆ లింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షు తెలుపుకుంటారు. అనంతరం తోటి బంధుమిత్రులకు, హిందూ సోదరులకు సేమియాలను పంపి పెడతారు. పేదరికం, ఆకలి, దప్పిక, విలువలు ఈ రంజాన్ మాసంలో అర్ధమవుతాయి. నేడు దేశ వ్యాప్తంగా ఈద్. ఉల్..ఫితర్ రంజాన్ పండుగను ముస్లిం సోదరులు జరుపుకుంటారు.

## పేదలకు అండగా నిలిచిన బోడేపూటి రమేష్ బాబు

**ప్రజాపక్షం/కామేపల్లి:** జీవితాంతం పేదలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడు దివంగత బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోడేపూటి రమేష్ బాబు అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పండితాపురంలో రమేష్ బాబు పదవ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంత



అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు సిద్ధాంతాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రమేష్ బాబు సతీమణి అనురాధ, బీఆర్ఎస్ నాయకులు తీర్థాల చిదంబరరావు, బోడేపూడి వీరప్రతాప్, యలమద్ది అప్పారావు, అంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, మూడ్ కృష్ణ ప్రసాద్, సామ మోహన్‌రెడ్డి, కాత్రాల రాంబాబు, నున్నావత్ సూర్య, మాలోత్ కిషన్, బాదావత్ సాజీ, జాటోత్ జాయ్ లూసి, శతకోటి హనుమంతరావు, తూము బాబు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, బాణోత్ రవి, అజ్మీరా హరినాయక్, పుచ్చకాయల ఉదయ్, ముత్యం రామకృష్ణ, ఆదూరి ప్రసాద్, ధరావత్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆగని షైన్ హైస్కూల్ ఆగడాలు

**ప్రజాపక్షం/ బోనకల్ :** ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో ఉన్న షైన్ హైస్కూల్‌లో సంచనల విషయాలు ఒక్కొక్కొటిగా బయటపడుతున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాల ఉపాధ్యాయులను వేధించే కేంద్రంగా మారిందనే ఆరోపణలు తీవ్రంగా విన్పిస్తున్నాయి. మహిళా ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి, అవమానాలు, బెదిరింపులు రోజువారీ వ్యవహారంగా మారాయని బాధితులు వాపోతున్నారు. వేతనాలు సమయానికి చెల్లించకపోవడం, అదనపు పనులు బలవంతంగా చేయించడం, ప్రశ్నిస్తే ఉద్యోగం తీసేస్తామంటూ బెదిరించడం ఇవి ఇక్కడి యాజమాన్యం పనితీరుని స్పష్టంగా చూపిస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బందిపై ప్రవర్తన మరింత దారుణంగా ఉందని, గౌరవం లేకుండా మాట్లాడటం, అవమానించడం జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు కూడా దిగజారుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ పట్టించుకోకుండా లాభాల కోసమే పాఠశాలను నడుపుతున్నారని విమర్శలు విన్పిస్తున్నాయి. ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురై పనిచేస్తుండటంతో విద్యా నాణ్యత తీవ్రంగా దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ ఇప్పటి వరకు గట్టి చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇంకా ఆలస్యం చేస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యాలయం అనే పవిత్ర స్థలంలో ఇలాంటి అక్రమాలు కొనసాగడం సమాజానికి ప్రమాదకరమని, నిజం బయటకు రావాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలు అంటున్నారు.

# కేటాయింపులు సరే.. ఖర్చు పైనే సంశయం

**-సిపిఐ నేత బాగం**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భారీ గణాంకాలు నమోదయ్యాయి కానీ కేటాయింపుల వారీగా ఖర్చులపైనే సంశయం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ అంకెలను ఘనంగా చూపించి ప్రజలను ఏమార్చే ప్రయత్నం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయని అప్పులతో కుంగిపోతున్న రాష్ట్రంలో ఈ బడ్జెట్‌లో కేటాయించిన విధంగా అమలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం పది శాతం మాత్రమే అంటే రూ.32వేల కోట్లు మాత్రమే కేటాయించారని ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి రాక ముందు చెప్పిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన కేటాయింపులు కూడా అరకొరగానే ఉన్నాయన్నారు. పాత బిల్లుల చెల్లింపుకే కేటాయింపులు సరిపోతాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు తులం బంగారం విషయాన్ని పట్టించుకోలేదన్నారు. రుణమాఫీ, రైతు బంధు, సంక్షేమం గురించి గొప్పగా చెప్పినప్పటికీ కేటాయింపు ఆ స్థాయిలో లేదని ఆయన అన్నారు. పింఛన్ పెంపుకు సంబంధించి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా నాలుగు వేలకు పెంచేందుకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. విద్య, వైద్యానికి కేటాయింపులు సరైన రీతిలో లేవని ఏడాది కాలంగా ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీకి సంబంధించి కేటాయింపులు లేవని హేమంతరావు తెలిపారు. బడ్జెట్‌పై ఎన్నో అంచనాలతో ఉన్న రాష్ట్ర ప్రజలకు భట్టి బడ్జెట్ సంతృప్తిని ఇవ్వలేకపోయిందన్నారు. ప్రధానమైన వ్యవసాయం, విద్య, వైద్యం కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవని సంక్షేమం, అభివృద్ధి కూడా ఈ కేటాయింపుల ప్రకారం ఆశించిన స్థాయిలో జరగదని ఆయన తెలిపారు. మొత్తంగా అంకెలు గనం అమలు శూన్యమన్న రీతిలో బడ్జెట్ ఉందని ఇక అమలుపై అనేక సంశయాలు ఉన్నాయని హేమంతరావు తెలిపారు.

# నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణి ఆదర్శనీయం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** నిరుపేద ముస్లీం కుటుంబాల వారికి రంజాన్ తోఫా పంపిణీ చేయడం ఆదర్శనీయం అని, పండుగల వేళ పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపడం సంతోషమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కొత్తగూడెం పట్టణం పరిధిలోని రామవరం, 2 ఇం క్లైన్ గ్రామ పంచాయితీ, వన్నందాస్ గడ్డ ఏరియాలో నిరుపేద కుటుంబాల వారికి రంజాన్ తోఫా పంపిణీ నిర్వహించారు. శ్యామల గోపాలం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని పేదలకు కిట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, ధాతృత్వం మానవతా విలువలు నేర్పుతుందన్నారు. ఆకలి విలువ తెలిసేలా ఉపవాస దీక్షలు చేస్తూ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయడం ఈ పండుగ విశిష్ట అని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల వారిని ఆదుకోవడానికి ట్రస్టు నిర్వాహకులు తాండ్ర నారాయణ రావు వంటి సంస్థలు ముందుకు రావడం శుభ పరిణామం అని, ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మత సామరస్యాన్ని కాపాడుకుంటూ అంతా ఐఖ్యమత్యంతో మెలిగిన నాడే బలమైన సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నయూమ్ కూరేషీ, షేక్ పహీందాదా, గోపి కృష్ణ, తూమల శ్రీనివాస్, అరుణ, సింగిరాల రమేష్, నగేష్, అంకూష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు**






**ప్రజాపక్షం/పాల్వంచ :** నమ్మకంతో ఎన్నుకొన్న ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాలను కూనంనేని చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభిమానాన్ని పొందగలిగిన వారే నిజమైన నాయకులవుతారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాల్వంచలో ఎన్నికల జరిపిస్తామనే హామీని నిలబెట్టుకొంటూ కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయితీలను కలిపి మునిసిపల్ కార్పోరేషన్‌గా ఏర్పాటు చేశామన్నారు. దీనిపై ఎన్ని అడ్డంకులు ఎదురైనా గుండె ధైర్యంతో మేదావుల సలహాలతో ముందుకు సాగామన్నారు. దీనికి నాతో పాటు అన్ని విధాలుగా కృషి చేసిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మునిసిపాలిటి కమీషనర్ సుజాత సహకారం మరువలేనిదని చెప్పారు. కార్పోరేన్ ఏర్పాటుతో పాల్వంచ సమగ్రాభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే వందల కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. నూతన బైపాస్ రోడ్ కొంత మేరకు పనులు జరిగాయని కొత్తగూడెం హెడ్ ఆఫీసు దగ్గర రైల్వే లైన్ ఉండటంతో సుమారు కిలో మీటర్ పైగా ఫ్లై ఓవర్ నిర్మాణం చేయాల్సి వస్తుందని దీనితో పనులు పూర్తి కావటానికి కొంత ఆలస్యం అవుతుందన్నారు. సుమారు 500 కోట్లతో రింగ్ రోడ్‌కు పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. ఎన్ఎండిసి పునరుద్ధరణకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. తిరిగి గాడిలో పెట్టేందుకు ఓ ప్రవేటు సంస్థ ముందుకు వచ్చిందని అన్నారు. ఇండస్ట్రియల్ పార్క్, ఐటి హబ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. వీటి కోసం స్థలం అన్వేషణ జరుగుతుందని తెలిపారు. కార్పోరేషన్ ఏర్పాటుతో పాల్వంచ ఫ్రీ అయిందన్నారు. ఇండస్ట్రియల్ ఏర్పాటుకు పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్వంచకు తరలిరానున్నారని అన్నారు. దీనితో పలువురికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అదనంగా కేటిపిఎస్ 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేంద్రాల సాధనకు పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చినందుకు జీవిత కాలపు సంతృప్తి దొరికిందన్నారు. ఇది ఎంత చెప్పినా తక్కువేనన్నారు. పలు స్కీముల ద్వారా పాల్వంచకు అధిక మొత్తంలో నిధులు వచ్చాయన్నారు.దీనితో పాల్వంచ స్వరూపం మారబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అధిక మెజారిటీ కట్టబెట్టిన పాల్వంచ అభివృద్ధికి సర్వశక్తులు ధారపోస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం మునిసిపల్ కార్పోరేషన్‌కు ఎన్నికైన కార్పోరేటర్‌లను ఘనంగా సన్మానించారు. ముందుగా చిన్నారులు ప్రదర్శించిన పలు కళారూపాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, మునిసిపల్ కమీషనర్ సుజాత, మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పోరేటర్‌లు, కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు బిక్కసాని సుధాకర్, అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, ఉపాధ్యక్షులు నామా బుచ్చయ్య, కోశాధికారి లింగమూర్తి, కవి శీరంశెట్టి కాంతారావు, ఎర్రగుంట సాంబశివరావు, చలవాది ప్రకాష్, సంపత్‌కుమార్ అప్పలాచార్య, వంకదారు నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రంగాలకు మొండిచేయి

**-బడ్జెట్‌పై సిపిఐ జిల్లా కార్యదర్శి దండి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రధాన రంగాలకు మొండి చేయి చూపారని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంతగా దృష్టి సారించలేదని ఆయన తెలిపారు. విద్య, వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రతి యేటా కనీస పెరుగుదల నమోదు కావాలని పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ఇలా జరగాల్సి ఉన్నా అది జరగ లేదని ఆయన అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు జరిగే పరిస్థితి కనిపించడం లేదని సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఈ బడ్జెట్ తర్వాత ఖచ్చితంగా పింఛన్లు పెరుగుతాయని ప్రజలు ఆశించారని కానీ కేటాయింపులు చూస్తే పింఛన్ పెంపుదల లేదన్నారు. ఆర్టిసి, కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తదితర విషయాల్లో ఈ బడ్జెట్‌లో సరైన రీతిలో కేటాయింపులు లేవన్నారు. అంకెలు గొప్పగా చెప్పినా, పది శాతం పెరిగిందని చెప్పినా నమ్మశక్యంగా లేదన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం నాలుగు లక్షలు పైబడి చూపించారని కానీ అది వాస్తవానికి విరుద్ధంగా ఉందని సురేష్ తెలిపారు.

## అంకెలు ఘనం.. అమలు శూన్యం

**-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలు ఘనంగా ఉన్నా వాటి అమలు మాత్రం శూన్యమని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. రూ.3.24 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పథకాల అమలుకు కేటాయింపులు మాత్రం నామ మాత్రంగా ఉన్నాయన్నారు. ఆరు లక్షల కోట్ల అప్పుల ఊబిలో రాష్ట్రం ఉందన్నారు. రైతు రుణమాఫీ, రైతు బందు, రైతు సంక్షేమం గురించి గొప్పగా చెప్పి వ్యవసాయ రంగానికి కేటాయింపులు రూ.32వేల కోట్లు కేవలం 10 శాతం మాత్రమే కేటాయించారన్నారు. విద్యకు ఎనిమిది శాతం కేటాయించారని, నీటిపారుదల, సాంఘిక సంక్షేమ శాఖలకు కేటాయింపులు కూడా ఇదేవిధంగా ఉన్నాయన్నారు. మహిళా భరోసాకు రూ. 2500, పెన్షన్ నాలుగు వేలు, ఇతర గ్యారెంటీల గురించి ప్రస్తావన లేదన్నారు. అంకెల్లో మాత్రమే బడ్జెట్ చూపించారని ప్రధాన రంగాలకు కేటాయింపులు మాత్రం నామ మాత్రంగా ఉన్నాయన్నారు.

## నిరాశజనకంగా బడ్జెట్

**-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అసెంబ్లీలో ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. రూ. 324234 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర వ్యాప్తంగా కేటాయింపుల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు దక్కే వాటా తప్ప ప్రత్యేక కేటాయింపులు లేవన్నారు. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క జిల్లాకు చెందిన వారని మరో ఇద్దరు మంత్రులు కూడా జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వాంసాన్ని సరిదిద్దుతున్నామని ప్రభుత్వం చెబుతున్న ఆచరణలో సంక్షేమం, అభివృద్ధికి ఈ బడ్జెట్ ఏమాత్రం సరిపోదన్నారు. బడ్జెట్ కేటాయింపులు నామ మాత్రంగా ఉన్నాయని ముఖ్యంగా వ్యవసాయం, సంక్షేమ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ఆరు గ్యారెంటీలపై అనుమానం నెలకొందని ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి రూ.24వేల కోట్లు కేటాయించిన సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక ఊసే లేదన్నారు. మున్నేరుపై ఆర్‌సిసి వాల్ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కేటాయింపులు ఏమి లేవని ఆ నిర్మాణం పూర్తి కావడంపై కూడా సందేహాలు నెలకొన్నాయన్నారు. ఖమ్మం జిల్లా ప్రజల ఆకాంక్షలకు, వాస్తవిక అవసరాలకు అనుగుణంగా ఈ బడ్జెట్ ఏ మాత్రం లేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం కార్పోరేషన్ అభివృద్ధికి రూ. 196 కోట్లు ప్రతిపాదించారన్నారు. అంకెల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమి లేదన్నారు.

## ప్రజల అవసరాలు తీర్చే బడ్జెట్

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అసెంబ్లీలో ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చేవిధంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ బడ్జెట్ ఆర్థిక వ్యవస్థ పునర్జీవనానికి పునాది వేసిందన్నారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవడంపై దృష్టి సారించారని, దాంబీకాలకు పోకుండా వాస్తవిక ధృక్పథంతో బడ్జెట్‌ను రూపొందించారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఆరు గ్యారెంటీల అమలుకు పెద్దపీట వేశారని, ఎస్సి,ఎస్టి, బిసిల సంక్షేమానికి నిధులు కేటాయించారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం హర్షణీయమని సత్యనారాయణ గౌడ్ తెలిపారు. అదేవిధంగా రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరీ, సోదరీ మణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.